

అభాగ్యులపై అక్కసు
'కూటమి' నేతలు కక్ష కట్టారు. రాజకీయపార్టీ ముద్ర వేసి పలువురి అభాగ్యుల పింఛన్లను నిలుపుదల చేయించారు. 8లో



టమాట కిలో రూ.30
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 పలికింది.

గరిష్టం/కనిష్టం
32.6°/22.8°
జిల్లా పరిధిలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం 'స్పందన' సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని మున్సిపాలిటీలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్పీ కార్యాలయంలో...
పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ప్రజలు వివిధ సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఖాద్రీశున్ని దర్శించుకున్న హైకోర్టు రిటైర్డు జడ్జి



రిటైర్డు జడ్జికి శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

కదిరి టౌన్: హైకోర్టు విశ్రాంత జడ్జి సి.మంజుల ఆదివారం కదిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఈఓ శ్రీనివాసరెడ్డి, అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఖాద్రీశునికి పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను అర్చకులు వివరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి, పూలమాలలు, శేష వస్త్రంతో సత్కరించి శ్రీవారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో కదిరి న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు 50,715 క్యూసెక్కుల వరద

బొమ్మనహాళ్: కర్ణాటకలోని హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం 19,201 క్యూసెక్కులు, శనివారం 25,556 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం ఉదయానికి 50,715 క్యూసెక్కులకు పెరిగింది. జలాశయంలో 18.249 టీఎంసీల నీరు నిల్వ అయ్యాయి. 1,633 అడుగుల ఎత్తుకు గాను 1,597.31 అడుగు వరకు నీరు చేరాయి. దీంతో తుంగభద్ర ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ సారి పంటలు సాగుకు అవసరమైన నీరు లభిస్తుందని ఆశిస్తున్నారు.

రైతన్నల గుండెల్లో రాజముద్ర

- వైఎస్సార్ హయాంలో పండుగలా వ్యవసాయం
- వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.13 వేల కోట్ల వ్యయం
- ఉచిత విద్యుత్, రుణమాఫీ, పంటల బీమాతో అన్నదాతలకు బాసట
- తండ్రికి తగ్గ తనయుడిగా రైతులకు వెన్నుదన్నుగా నిలిచిన వైఎస్ జగన్
- రైతుల ఖాతాల్లోకి నేరుగా రూ.8 వేల కోట్లు జమ

ప్రకృతి కన్నెర్ర చేసింది. పాలకుల కరుణ కరువైంది. వరుణుడు పత్తా లేకుండా పోయాడు.వర్షాలు లేక, పంటలు పండక 1993 నుంచి 2004 మధ్య కాలంలో కరువు రక్కసి కబంధ హస్తాల్లో 'అనంత' రైతన్న చిక్కుకున్నారు. అలాంటి తరుణంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశాకిరణంగా కనిపించారు. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయి అన్నదాత దిక్కులు చూస్తున్న సమయంలో అపర భగీరథుడిగా నిలిచారు. చేతిలో చిల్లిగవ్వ లేక పొట్ట చేతపట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్న కూలీలు, పేదల ఇంటికి పెద్ద కొడుకయ్యారు. పుట్టెడు అప్పులతో పిల్లల్ని చదివించలేక, ఆత్మాభిమానం చంపుకోలేక అర్ధంతరంగా అసువులు బాసిన రైతుల కుటుంబాలతో పాటు, పేదలకు అండగా నిలిచారు. అన్ని వర్గాలకూ అందరి బంధువయ్యారు. అందుకే ఆయన మరణించి 15 యేళ్లు కావస్తున్నా నేటికీ అందరి మదిలో చెరగని ముద్ర వేసుకున్నారు. నేడు మహానేత వైఎస్సార్ 75వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.



అనంతపురం అగ్రికల్చర్:2004లో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన వేదికపై ఉచిత కరెంటు, విద్యుత్ బిల్లుల మాఫీ చేస్తూ తొలి సంతకంతోనే దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి వ్యవసాయానికి ఊపిరి పోశారు. ఆ ఒక్క సంతకంతో ఉమ్మడి జిల్లా రైతులకు చెందిన రూ.70.65 కోట్ల విద్యుత్ బిల్లులు మాఫీ అయ్యాయి. ఐదేళ్లు 1.75 లక్షల వ్యవసాయ మోటార్లకు రూ.వందల కోట్ల విలువ చేసే కరెంటు ఉచితంగా సరఫరా చేశారు. ఖరీఫ్‌లో పంట రుణాల పంపిణీ రూ.6,594 కోట్లకు చేర్చారు. పావలా వడ్డీ కింద రూ.44 కోట్లు ఇచ్చారు.

పంటల బీమాతో ధీమా..
అప్పట్లో చంద్రబాబు హయాంలో అమలవుతున్న పంటల బీమా పథకాన్ని మార్పు చేసి రైతులకు ఎనలేని ధీమా కల్పించారు. 2004-2009 మధ్య వైఎస్ హయాంలో వేరుశనగ రైతులకు పంట కోత ఫలితాల ఆధారంగా బీమా కింద ఏకంగా రూ.1,138 కోట్ల పరిహారం దక్కింది. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.100 కోట్లు అందింది.

ఒకే విడతగా రుణమాఫీ..
2008లో తీవ్ర కరువు పరిస్థితుల నేపథ్యంలో అప్పట్లో కేంద్ర ప్రభుత్వం సహకారంతో వైఎస్సార్ 3,03,937 మంది రైతులకు చెందిన రూ.554.92 కోట్ల రుణాలు ఒకేవిడతలో మాఫీ చేశారు. అప్పటికే బ్యాంకులకు రుణాలు చెల్లించిన రైతులకు ప్రోత్సాహకాల కింద 3,61,269 మందికి రూ.5 వేల చొప్పున రూ.174.04 కోట్లు అందజేశారు. మొత్తమ్మీద రుణమాఫీ, ప్రోత్సాహకాల కింద ఒకే విడతగా 6,65,206 మంది రైతులకు రూ.625 కోట్ల లబ్ధి చేకూర్చారు.

రాయితీతో విత్తనాలు..
ఖరీఫ్, రబీలో రైతులకు లక్షల క్వింటాళ్ల వేరుశనగ, పప్పుశనగ, కంది, ఇతర విత్తనాలు రాయితీతో ఇచ్చారు. 2004- 2009 వరకు ఆరేళ్ల కాలంలో 28,05,901 మంది రైతులకు రూ.280.88 కోట్ల రాయితీతో 26,02,717 క్వింటాళ్ల వేరుశనగ అందజేశారు. కంది, ఆముదం లాంటి ఇతర విత్తనాల కోసం రూ.80 కోట్లు ఖర్చు చేశారు.

అనుబంధ రంగాలకూ ప్రాధాన్యత..
వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పాడి, పశుపోషణ, పట్టు, పండ్లతోటలు, డ్రిప్, స్ప్రింక్లర్ల రైతులకు కూడా చేయూత అందించారు. రూ.25 కోట్ల రాయితీ ఇచ్చి పశుక్రాంతి, జీవక్రాంతి కింద 50 శాతం రాయితీతో మేలుజాతి పశువులు, గేదెలు అందజేసి క్షీర విప్లవానికి నాంది పలికారు. 40 వేల హెక్టార్ల పండ్లతోటల విస్తరణకు రూ.80 కోట్ల సబ్సిడీ అందజేశారు. దీంతో అప్పట్లోనే 'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీ'గా పేరొచ్చింది. బిందు, తుంపర (డ్రిప్, స్ప్రింక్లర్లు) పరికరాలను ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, ఇతర రైతులకు 90 శాతం రాయితీతో అందజేశారు. సూక్ష్మసేద్యం విస్తరణకు రూ.280 కోట్ల రాయితీ ఇవ్వడంతో 1.13 లక్షల హెక్టార్లకు చేరుకుంది. ఇలా వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ఏకంగా రూ.13 వేల కోట్ల వరకు ఖర్చు చేశారు.

అంతకు మించి..

తండ్రి వైఎస్సార్‌కు తగ్గ తనయుడిగా గత ఐదేళ్ల కాలంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంతకు మించి అన్నట్లుగా అన్నదాతకు అడుగడుగునా అండగా నిలిచింది. కరోనా కాలంలో ఉద్యాన ఉత్పత్తుల అమ్మకాలకు ప్రోత్సాహం లాంటివే కాకుండా కేవలం రైతు సంక్షేమానికి ఏకంగా రూ.8 వేల కోట్లకు పైగా వెచ్చించారు. దేశంలో తొలిసారిగా ఊరూరా రైతు భరోసా కేంద్రాల వ్యవస్థతో వ్యవసాయ విప్లవానికి శ్రీకారం చుట్టారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ కోసం గ్రామం దాటి వెళ్లకుండా 867 ఆర్‌బీకేలను నిర్మించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత పరిశీలనకు ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌లతో పాటు పశుసంపద, జీవాల రక్షణకు వెటర్నరీ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. 108 మాదిరిగా 1962 కింద మొబైల్ వెటర్నరీ అంబులెన్సులు తెచ్చారు. రైతు గ్రూపులకు ప్రతి ఆర్‌బీకే పరిధిలో రూ.15 లక్షలు వెచ్చించి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) కింద ట్రాక్టర్లు, ఇతర అధునాతన యంత్ర పరికరాలు అందించారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచితంగా పంటల బీమా పథకాన్ని అమలు చేశారు. ఏటా మూడు విడతల్లో రైతు భరోసా-పీఎం కిసాన్ కింద రూ.13,500 పెట్టుబడి సాయం ఇచ్చారు. ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా 'ఈ-క్రాప్', ఈ-కేవైసీ పారదర్శకంగా చేపట్టారు. రాయితీతో డ్రిప్, స్ప్రింక్లర్లు అందించారు. ఇలా వ్యవసాయ, అనుబంధ రంగాల పురోభివృద్ధికి అడుగడుగునా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారం అందజేశారు.

కరువు జిల్లాకు జలప్రదాత

అనంతపురం సెంట్రల్: దేశంలో జై సల్మీర్ తర్వాత అత్యంత దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరువు నివారించేందుకు వైఎస్సార్ అనేక చర్యలు తీసుకున్నారు. నేడు జిల్లా ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు సాగు అవసరాలను తీరుస్తున్న హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం మహానేత కృషి ఫలితమే.

తాగునీటి ప్రాజెక్టు సాగునీటిగా..
తాగునీటి ప్రాజెక్టుగా ప్రతిపాదనల్లో ఉన్న హంద్రీనీవాను చొరవ తీసుకుని సాగునీటి ప్రాజెక్టుగా వైఎస్సార్ మార్చారు. శ్రీశైలం జలాశయం నుంచి ఎత్తిపోతల ద్వారా చిత్తూరు వరకూ నీటిని తీసుకెళ్లేలా రూపకల్పన చేశారు. 6.02 లక్షల ఎకరాలకు సాగు, 33 లక్షల మందికి తాగునీరు అందించే బృహత్తర ప్రాజెక్టును ఆచరణలో పెట్టారు. సుమారు రూ. 3,185 కోట్లతో పనులు ప్రారంభించారు. శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీలు సాధించాలని లక్ష్యం కాగా ప్రస్తుతం ఏటా 20 టీఎంసీలకు పైగా జలాలు వస్తున్నాయి. 2012 నుంచి కృష్ణాజలాల రాక మొదలైంది. 2020-21లో 39.607 టీఎంసీలు, 2021-22లో 26.458 టీఎంసీలు, 2022-23లో 23.709 టీఎంసీలు, 2023-24లో 21.368 టీఎంసీలు జిల్లాకు వచ్చాయి.

హెచ్చెల్సీ ఆధునికీకరణ..
స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రాలకు తుంగభద్ర జలాశయాన్ని నిర్మించారు. హైలెవల్ మెయిన్ కెనాల్ ద్వారా కర్ణాటకతో పాటు అనంతపురం, వైఎస్సార్ జిల్లాలకు తాగు, సాగునీరు అందిస్తున్నారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కాలవ ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ. 458 కోట్లు కేటాయించారు. ఆయన హయాంలోనే వివిధ దశల్లో రూ. 308.78 కోట్లు ఖర్చు చేశారు. ఈ క్రమంలోనే మహానేత మరణించడంతో పనులు ఆటకెక్కాయి. అప్పట్లో రూ. 148.64 కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగా, నేడు వాటిని పూర్తి చేయాలంటే ప్రస్తుత ధరల ప్రకారం రూ. 450 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పనులు పూర్తయితే తుంగభద్ర జలాశయం నుంచి 4,200 క్యూసెక్కుల నీటిని తీసుకోవచ్చు. ప్రస్తుతం 2 వేల క్యూసెక్కులకు మించి తీసుకోవడానికి ఆస్కారం లేదు.



హంద్రీనీవా కాలువ

పెన్నానదిపై ఆనకట్టలు..
జిల్లాలో ఒకప్పుడు పెన్నానది పూర్తిగా ఎండిపోయి ఇసుక మేటలు దర్శనమిస్తున్న పరిస్థితి. అలాంటి చోట నీటిని ఒడిసి పట్టేందుకు మహానేత వైఎస్సార్ ప్రాజెక్టులు నిర్మించారు. జలయజ్ఞం పథకంలో భాగంగా పెద్దపప్పూరు మండలంలో రూ. 244 కోట్లతో చాగల్లు, రూ. 110 కోట్లతో పెండేకల్లు రిజర్వాయర్లు పూర్తి చేశారు. రెండు ప్రాజెక్టుల్లో దాదాపు 2 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చు. దీంతో శింగనమల, పెద్దపప్పూరు, తాడిపత్రి ప్రాంతాల్లో తాగు, సాగునీటి సమస్యకు పరిష్కారం దొరికింది.

పీఏబీఆర్‌కు 10 టీఎంసీలు..
పీఏబీఆర్‌కు వైఎస్సార్ 10 టీఎంసీలను కేటాయించారు. కేవలం నీటిని నిల్వ చేసుకోవడానికి మాత్రమే ఉపయోగిస్తున్న రిజర్వాయర్‌కు 2006లో వైఎస్సార్ తుంగభద్ర డ్యాం నుంచి కేసీ కెనాల్ వాటా 10 టీఎంసీలను రివర్స్ డైవర్షన్ పద్ధతిలో కేటాయించారు. అప్పట్లో వైఎస్సార్ చలువతో నేటికీ ఏటా అదనపు జలాలు జిల్లాకు వస్తున్నాయి. ప్రతి సంవత్సరం 4 నుంచి 5 టీఎంసీలు చేరుతున్నాయి. అక్కడితో ఆగకుండా వైఎస్సార్ తాగునీటి పథకం, శ్రీరామరెడ్డి తాగునీటి పథకాలకు శ్రీకారం చుట్టారు. నేడు ఈ పథకాలు దాదాపు జిల్లా అంతటికీ తాగునీటిని సరఫరా చేస్తున్నాయి. పీఏబీఆర్‌కు వచ్చే అదనపు జలాలను తాగునీటి అవసరాలకు వినియోగించుకుంటున్నారు.

నేటి నుంచి ఉచిత ఇసుక విధానం

- జిల్లాలో 5 స్టాక్ పాయింట్లు
- నిర్వహణ వ్యయం కింద టన్నుకు రూ.277
- ఇన్‌చార్జ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ వెల్లడి



ఇన్‌చార్జ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన ఆదివారం మీడియాకు వెల్లడించారు. జిల్లాలోని ఉప్పలపాడు, కొడవండ్లపల్లి, నల్లబోయినపల్లి, రామగిరి మొత్తం ఐదు స్టాక్‌పాయింట్లలో 61,300 టన్నుల ఇసుక నిల్వ చేసినట్లు పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఇసుక స్టాక్ పాయింట్లకు తరలించేందుకు అయ్యే నిర్వహణ వ్యయాన్ని వసూలు చేయనున్నట్లు చెప్పారు. ఉచిత ఇసుకను రోజుకు ఒక వ్యక్తికి 20 టన్నులు మాత్రమే ఇస్తారు. వాహనాలను వినియోగదారులే సమకూర్చుకోవాలి. రోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఇసుక యార్డులు తెరిచి ఉంచుతారని పేర్కొన్నారు. ఈ సమయంలోనే ఇసుకను తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. నిర్వహణ వ్యయం కింద టన్నుకు రూ.277 వసూలు చేయనున్నట్లు వెల్లడించారు. డిజిటల్ విధానంలో డబ్బు చెల్లించాలని సూచించారు. ఇసుక సరఫరాకు ప్రతి స్టాక్ యార్డు వద్ద వీఆర్ఓ, వీఆర్ఏ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించనున్నట్లు చెప్పారు. రవాణా సమయంలో ఎవరైనా తనిఖీ చేస్తే యార్డు వద్ద ఇచ్చిన రసీదు చూపించాలన్నారు. స్థానికంగా ఉన్న వాగులు, వంకలు, నదుల నుంచి ఎడ్ల బండ్ల ద్వారా తరలించడానికి అనుమతిస్తామని తెలిపారు. ఇసుక సరఫరాపై ఆర్డీఓలు, తహసీల్దార్లు నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఇసుక సరఫరాపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800-4256041 అందుబాటులో ఉంటుందన్నారు. సరఫరాలో సమస్యలు పరిష్కరించడానికి జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెవెన్యూ, గనులు, పోలీస్, రవాణా శాఖ అధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారన్నారు.

అలరించిన సాయి వైభవం నృత్యరూపకం

ప్రశాంతి నిలయం: సత్యసాయి అవతార వైభవాన్ని చాటుతూ భక్తులు నిర్వహించిన సంగీత నృత్యరూపకం భక్తులను అలరించింది. పర్తియాత్రలో భాగంగా తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా సత్యసాయి భక్తులు ఆదివారం ప్రశాంతి నిలయం చేరుకుని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సంగీత విభావరి పేరుతో భక్తిగీతాలు ఆలపించారు. 'అవతార వైభవంలో ఆది పర్వం' పేరిట సాయంత్రం సంగీత నృత్యరూపకం ప్రదర్శించారు. సత్యసాయి లీలలను, మానవాళికి అందించిన సేవలను వివరిస్తూ నృత్యరూపకం సాగింది.



'అవతార వైభవంలో ఆదిపర్వం' నృత్య రూపకంలోని ఘట్టం

క్లుప్తంగా

15న కాంట్రాక్టు లెక్చరర్ల రెన్యూవల్

కదిరి అర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్‌కు స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15న రెన్యువల్స్ ఉంటాయని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.స్మిత ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 విద్యాసం వత్సరంలో 31-03-24 తేదీవరకు పనిచేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉదయం 11 గంటలకు డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ నిర్ణయం మేరకు రెన్యూవల్స్ ఉంటాయన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు తాము పని చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్‌లకు 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కౌన్సిలింగ్‌లో ఒకే కళాశాలలో 5 సంవత్సరాలుగా పనిచేస్తున్న అధ్యాపకులకు బదిలీలు ఉంటాయన్నారు.

ఆంధ్ర మహిళా క్రికెట్ ఆపరేషన్ మేనేజర్‌గా 'మచ్చా'


మచ్చా రామలింగా రెడ్డి

అనంతపురం: భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) అనుబంధం ఆంధ్ర మహిళా క్రికెట్ అసోసియేషన్‌కు నూతన ఆపరేషన్ మేనేజర్‌గా అనంతపురానికి చెందిన మచ్చా రామలింగారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ మహిళా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, భారత మహిళా క్రికెట్ అసోసియేషన్ డబ్ల్యూసీఐ జాయింట్ సెక్రెటరీగా గతంలో ఆయన పనిచేశారు. ఈ క్రమంలో ఏపీలోని అన్ని జిల్లాల్లో అసోసియేషన్లు ఏర్పాటు చేసి, మహిళా క్రికెట్ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు.

జోనల్ టోర్నీ విజేత 'కృష్ణా'


భారత జట్టు మహిళా క్రికెటర్ అనూషతో విజేత జట్టు సభ్యులు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -19 మహిళా జోనల్ క్రికెట్ టోర్నీ విజేతగా కృష్ణా జిల్లా జట్టు నిలిచింది. సెంట్రల్, కృష్ణా, నార్త్ జోన్ జట్లు టోర్నీలో పాల్గొన్నాయి. ఆదివారం కృష్ణా, విశాఖపట్నం జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖపట్నం జట్టు 7 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. జట్టులో డీఎస్ హితాన్ని 142 బంతుల్లో 71 పరుగులు , పి. వైష్ణవి 53 బంతుల్లో 24 పరుగులు చేశారు. తర్వాత వర్షం రావడంతో డీఎల్ఎస్ విధానంలో 126 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కృష్ణా జట్టు కేవలం 19 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో రంగ లక్ష్మి 15 బంతుల్లో 21పరుగులు, జి.మోహక్ 47 బంతుల్లో 53 పరుగులు, గుణచంద్రికారెడ్డి 52 బంతుల్లో 35 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలకంగా నిలిచారు. విజేత జట్టు క్రీడాకారులను భారత జట్టు మహిళా క్రికెటర్ బి.అనూష అభినందించారు.

అభాగ్యులపై అక్కసు



దీనంగా చూస్తున్న ఇతని పేరు రామాంజినేయులు. బత్తల పల్లి మండలం వెంకటగారిపల్లె గ్రామ నివాసి. ప్రభుత్వం అందించే దివ్యాంగుల పింఛన్‌తో కుటుంబాన్ని పోషించుకునేవాడు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడనే కారణంతో ఈ నెలలో అతడికి పింఛన్ పంపిణీ చేయలేదు. పింఛన్ ఇవ్వండని ఎంపీడీఓ, సచివాలయం చుట్టూ తిరిగినా పట్టించుకునేవారు లేకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి లక్ష్మిరెడ్డి. ధర్మవరం మండలం రేగాటిపల్లి గ్రామం. గత నెల వరకు సాఫీగానే పింఛన్ అందింది. ఈ నెలలో అధికార పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి లక్ష్మిరెడ్డికి పింఛన్ ఇవ్వకుండా నిలుపుదల చేయించారు.

- పింఛన్ ఇవ్వకుండా వేధింపులు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే టార్గెట్
- అధికారులను వేడుకున్నా ఫలితం శూన్యం
- న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తున్న బాధితులు


ధర్మవరం కోర్టు ఎదురుగా ఆవేదన వ్యక్తం చేస్తున్న పింఛన్‌దారులు

ధర్మవరం: కూటమి పాలనలో అభాగ్యులకు సామాజిక భద్రత కరువైంది. రాజకీయ కక్షతో పింఛన్లు ఆపేస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కిడ్నీ, తలసేమియా బాధితులు, దీర్ఘకాలిక జబ్బులతో మంచానపడిన వారికి ప్రభుత్వం సామాజిక భద్రత కింద పింఛన్లు అందజేస్తోంది. గత ప్రభుత్వంలో సాఫీగా సాగిన పింఛన్ల పంపిణీ జూలైలో గందరగోళం నెలకొంది. టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే నిజస్వరూపం బయటపెట్టుకుంది. తమకు ఓటు వేయలేదని, వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారని ముద్రవేసిన అధికార పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి సదరు లబ్ధిదారుల పింఛన్లను నిలుపుదల చేయించారు. పలువురు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందక కుటుంబ పోషణ భారమైంది. వైద్య, ఇతర ఖర్చులకు డబ్బు లేక ఆరోగ్యం దెబ్బతింటోంది. అయినా అధికార పార్టీ నాయకులు కనికరించడం లేదు. మానవత్వం మరచి అభాగ్యులను కంటతడి పెట్టిస్తున్నారు.

- ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం పట్టణం, మండలం, తాడిమర్రి, ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాల్లో 58 వేల మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ అందజేశారు. అలా ప్రతి నెలా నియోజకవర్గ వ్యాప్తంగా రూ.9 కోట్ల మేర పింఛన్ పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేశారు. అయితే వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులకు పింఛన్ అందకుండా కూటమి నాయకులు ఇబ్బందులు సృష్టించారు. అర్హత ఉన్నప్పటికీ రాజకీయ పార్టీ రంగు పులిమి వారికి పింఛన్ ఇవ్వడం లేదు. ధర్మవరం మండలంలో 6,922 మంది లబ్ధిదారులు ఉండగా రేగాటిపల్లి, కుణుతూరు, ఏలకుంట్ల పంచాయతీల పరిధిలో 60 మంది పింఛన్లను, బత్తలపల్లి మండలం మాల్యవంతం పంచాయతీ పరిధిలో 6,166 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా వారిలో 35 మంది పింఛన్లను నిలుపుదల చేశారు. తాడిమర్రి మండలంలో 6,166 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా.. వారిలో 35 మందికి పింఛన్ ఆపేశారు. కానీ అధికారులు నేరుగా ఈ విషయాన్ని ఒప్పుకోక పోగా.. సదరు లబ్ధిదారులు అందుబాటులో లేరని ఉన్నతాధికారులకు నివేదించడం కొసమెరుపు.

న్యాయం కోసం కోర్టులకు..

ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో పింఛన్ అందని బాధితులు ధర్మవరం సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో ఫిర్యాదు చేశారు. అన్ని అర్హతలూ ఉన్నప్పటికీ పింఛన్ అందించకుండా వేధిస్తున్నారని, తమకు

నిలుపుదల దారుణం



సామాజిక భద్రత పింఛన్ల విషయంలో లబ్ధిదారులకు పార్టీల రంగు పులిమి వారి పింఛన్లను నిలుపుదల చేయడం దారుణం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా 58వేల మంది లబ్ధిదారులకు పార్టీలకతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందించారు. వలంటీర్ల ద్వారా టీడీపీ, జనసేన, బీజేపీ వారితో పాటు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ పంపిణీ చేశాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులందరికీ పింఛన్ అందించాలి.

– బగ్గిరి బయపరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, ధర్మవరం నియోజకవర్గం

చెస్ టోర్నీ విజేతలుగా నిఖిలేంద్ర, జ్ఞాపికారెడ్డి


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని స్పార్టన్ చెస్ అకాడమీ వేదికగా ఆదివారం జిల్లా అండర్-19 ఓపెన్, బాలికల చాంపియన్ షిప్ చెస్ పోటీలు ముగిసాయి. జిల్లా చెస్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సౌజన్యంతో స్పార్టన్ అకాడమీ ఆధ్వర్యంలో స్విస్ లీగ్ పద్ధతిలో మొత్తం నాలుగు రౌండ్లు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 27 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రెటరీ నాగార్జున, కోచ్ ఆరీఫుల్లా మాట్లాడుతూ పోటీలో టాప్-4 లో నిలిచిన క్రీడాకారులు ఈ నెల 18, 19 నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-19 ఓపెన్, బాలికల పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ అష్రాఫ్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ఓపెన్ విభాగంలో విజేతలు :

ఛాంపియన్ : నిఖిలేంద్ర, 4/4 పాయింట్లు
రెండవ స్థానం: కేదార్నాథ్, 4/3 పాయింట్లు
మూడో స్థానం : మిథున్ పెద్దన్న, 4/3 పాయింట్లు
నాలుగవ స్థానం : హర్ష, 4/3 పాయింట్లు

బాలికలు విభాగంలో విజేతలు:

చాంపియన్ : జ్ఞాపికారెడ్డి, 4/4 పాయింట్లు
రెండవ స్థానం: మోక్షిత, 4/3 పాయింట్లు
మూడో స్థానం : పూర్ణమ్మ, 4/3 పాయింట్లు
నాలుగో స్థానం: సహస్ర, 4/3 పాయింట్లు

గౌరవనహళ్లిలో హైఓల్టేజీ

- గృహోపకరణాలు దగ్ధం


కాలిపోయిన టీవీ

పరిగి: మండలంలోని గౌరవనహళ్లిలో హైఓల్టేజ్ విద్యుత్ సరఫరా కావడంతో ఆదివారం పలు ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్‌లు, కరెంటు స్విచ్‌లు, బోర్డులు, తదితర వస్తువులు దగ్ధమయ్యాయి. ఇటీవల గ్రామంలో ఏర్పాటు చేసిన డీపీ వద్ద ఫేజ్ వైరు, న్యూట్రల్ వైర్లు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటూ ప్రధానంగా గ్రామంలో కొబ్బరి చెట్లపై వెళ్తున్న విద్యుత్ లైన్లను సక్రమంగా తొలగించకపోవడంతో డీపీ వద్ద ఫేజ్, న్యూట్రల్ వైర్లు కాలిపోవడంతో సమస్య ఏర్పడి ఉంటుందంటున్నారు.

బీసీ మంత్రి ఇలాకాలో దళితులపై దాడులా?

- మీకు అధికారం ఇచ్చింది బలహీన వర్గాలపై దాడులు చేయడానికా?
- మంత్రి సవితపై మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ఆగ్రహం


రొద్దం కంచిసముద్రంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం: బీసీ సంక్షేమశాఖ మంత్రి ఇలాకాలో దళితులపై దాడులు జరగడం సిగ్గుచేటని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ విమర్శించారు. బీసీ సంక్షమశాఖ మంత్రిగా సవితమ్మ ఉన్నారని, అయితే ఎస్సీలు, వెనకబడిన కులాలకు చెందిన వారిపై టీడీపీ కార్యకర్తలు దాడులు చేస్తుంటే పట్టించుకోకుండా ఉన్నారంటే బలహీన వర్గాలకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు దళితుడి ఇంట్లోకి చొరబడి దాడికి తెగబడటం సమంజసం కాదన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నాయకులు అధైర్య పడొద్దని అన్నారు. అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

టీడీపీ నాయకులు దాడి చేసిన రొద్దం మండలం కంచిసముద్రం దళిత వాడకు చెందిన సువర్ణ, నరసింహులు దంపతుల కుటుంబాన్ని ఆదివారం మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పరామర్శించారు. దాడి ఎలా జరిగిందో వారిని అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు రౌడీయిజం, దౌర్జన్యం, కక్ష సాధింపు మానుకోవాలని హితవు పలికారు. గ్రామాల్లో ఘర్షణ వాతావరణం సృష్టించకుండా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ వర్గీయులు అరాచకాలు సృష్టిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే నెపంతో కొందరిని టార్గెట్ చేసి దాడులు చేయడం హేయమన్నారు. అధికారం ఎప్పుడూ ఒకరికి శాశ్వతం కాదన్నారు. మంచి పరిపాలన అందివ్వాలని కూటమికి అధికారం ఇచ్చారు తప్ప దాడులు చేయాలని కాదన్నారు. ఇంతవరకూ పింఛన్లు మాత్రమే ఇచ్చారని, తల్లికి వందనం, రైతు భరోసా ఇవ్వన్నీ ఇవ్వకుండా ప్రజల దృష్టి మళ్లించడానికి దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘటితంతోనే బ్రాహ్మణుల అభ్యున్నతి


మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

అనంతపురం కల్చరల్: ఐక్యత లేని కారణంగా బ్రాహ్మణులు అన్నింగా వెనుకబడ్డారని, కేవలం సంఘటితంతోనే అభ్యున్నతి సాధ్యమని వక్తలు అన్నారు. అనంతపురంలోని మొదటిరోడ్డు శివాలయం వేదికగా ఆదివారం బ్రాహ్మణ సమ్మేళనం జరిగింది. వేర్వేరుగా ఉన్న అన్ని సంఘాలను సంఘటితం చేసి అఖిలభారత బ్రాహ్మణ ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి అనంత, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి సంఘాల నాయకులు, అర్చక పురోహితులు తరలి వచ్చి తమ సమస్యలను వినిపించారు. ఎస్.శివరాం అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు ఏఎల్ఎన్ శాస్త్రి, సీనియర్ న్యాయవాది హోసూరు రామసుబ్రహ్మణ్యం, విశ్రాంత డీఎస్పీలు గిరికుమార్, లక్ష్మయ్య, బత్తలపల్లి సత్యరంగారావు, బద్రీనాథ్, సంకేపలి సత్యనారాయణ, నార్పల మారుతి తదితరులు మాట్లాడారు. శాఖలుగా, గోత్రాలుగా విడిపోయి ఐక్యత లేక అభివృద్ధికి నోచుకోని బ్రాహ్మణసంఘాలన్నింటినీ ఏకతాటిపైకి తేవడానికి కృషి సాగుతోందన్నారు. భవిష్యత్తులో కూడా ప్రత్యేక సమావేశాలు జరుగుతాయన్నారు. ఈ నెల 21వ ఆర్ఎఫ్‌రోడ్డు లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రాహ్మణ వధూవర పరిచయ వేదిక ఉంటుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కష్టాల్లో ఉన్న సాటి బ్రాహ్మణుడికి సాయపడేలా నిత్య చైతన్యం చేయాలని తీర్మానించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, వేదపఠనం జరిగాయి. కార్యక్రమంలో సంఘం నాయకులు, అర్చక సంఘం ప్రతినిధులు దేవరకొండ బాలాజీ శర్మ, అనంత పద్మనాభ శర్మ, రామసుబ్బారావు, శ్రీనివాస్, జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, దేవరకొండ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని విధాలుగా ఎదగాలి

- ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ


ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

తాడిపత్రి అర్బన్: ఆర్యవైశ్యులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ పిలుపు నిచ్చారు. ఆదివారం తాడిపత్రిలోని ఆర్వీ స్వామి కల్యాణమంటపంలో మహాసభ తాడిపత్రి శాఖ, మహిళా విభాగాల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా ఆర్యవైశ్యుల కోసం కృషి చేసే వారిని ఏ పార్టీలో ఉన్నా వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ తాడిపత్రి అధ్యక్షుడిగా ఎన్నికైన వంకదారి మద్దిలేటి (రాజా), గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్న తలుపుల సురేంద్రనాథ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎన్నికైన కంబం నాగరత్న, కార్యదర్శి నగరూరు స్వర్ణలత, మరో 35 మంది కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. గ్లోబల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యోతి ప్రసాద్, ట్రెజరర్ ఎల్వీ కుమార్, సలహాదారు తాడిపల్లి రాజశేఖర్, రాష్ట్ర సౌత్ అధ్యక్షుడు జక్కా సుబ్బరాజు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


పురుగు మందులను పరిశీలిస్తున్న అధికారులు

ధర్మవరం రూరల్: వ్యవసాయశాఖ, విజిలెన్స్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు పుంగనూరు శివకుమార్, ఏలూరు జిల్లా విజిలెన్స్‌శాఖ ఎస్ఐ రంజిత్‌కుమార్, వ్యవసాయ సంచాలకులు కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల స్టాకు తదితర వాటిని పరిశీలించారు. ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ముస్తఫా, టెక్నికల్ ఏఓ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిగి వైస్ ఎంపీపీపై దాడికి యత్నం

పరిగి: మండల వైస్ ఎంపీపీ వేదవతి కుటుంబంపై టీడీపీ నాయకుడు బుడేన్‌సాబ్ దాడికి యత్నించాడు. బాధిత వైస్ ఎంపీపీ వేదవతి తెలిపిన వివరాలమేరకు... మండలంలోని శ్రీరంగరాజుపల్లి పంచాయతీ ముల్లమోతుకపల్లిలో నివాసముంటున్న వేదవతి, నరసింహారెడ్డి దంపతులతో శనివారం రాత్రి అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బుడేన్‌సాబ్ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం విషయంలో గొడవకు దిగాడు. టీడీపీ అధికారంలోకి రాగానే మధ్యాహ్న భోజన ఏజెన్సీపై కన్నేసిన బుడేన్‌సాబ్ ఇటీవల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నాడు. అయితే అధికారబలంతో శనివారం రాత్రి సమయంలో తమ ఇంటికి వచ్చి, ఇటుక చేతిలో పెట్టుకొని వచ్చి దాడికి యత్నించాడని వేదవతి తెలిపారు. నానా దుర్భాషలతో అక్కడున్న తమ కుటుంబ సభ్యులను కూడా అసభ్యకర పదజాలంతో దూషించాడని వాపోయారు. ఈక్రమంలో జరిగిన సంఘటనపై పరిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. జరిగిన ఘటనపై విచారణ చేసి, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశామని వేదవతి, ఆమె భర్త నరసింహారెడ్డి తెలిపారు.

సిరులు కురిపిస్తున్న కూరగాయలు


పెదబల్లి సమీపంలో సాగులో ఉన్న బీర పంట


ఓడీ చెరువు పరిధిలో విస్తారంగా సాగైన టమాట పంట

- తీగజాతి పంటలకు గిట్టుబాటు
- పెరుగుతున్న కూరగాయల సాగు విస్తీర్ణం

పుట్టపర్తి అర్బన్: సాంప్రదాయ పంటలకు స్వస్తి పలికి కూరగాయల పంటలను సాగు చేసిన రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. ముఖ్యంగా తీగ జాతి పంటలకు గిరాకీ పెరిగింది. గత నెలలో టమాట, ఉల్లిగడ్డకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు రావడంతో సాగు చేసిన రైతులు లబ్ధి పొందారు. ప్రస్తుతం వాటితో పాటు తీగజాతి పంటలైన కాకర, బీర, సొరకాయ, చిక్కుడు తదితర పంటలకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. ప్రస్తుత మార్కెట్‌లో బీరకాయలు టన్ను రూ.40 వేలు, కాకర టన్ను రూ.60 వేలు, టమాట 13 కిలోల బాక్సు రూ.400 నుంచి రూ.600 వరకూ పలుకుతున్నాయి.


ఖర్చు అధికమే..

తీగ జాతి పంటల సాగుకు ఖర్చు అధికంగా వస్తుంది. ఒక ఎకరా సాగు చేయడానికి రూ.లక్షన్నర వరకూ ఖర్చవుతుండటంతో చాలా మంది రైతులు వాటి జోలికి వెళ్లరు. వాటి విత్తనాలు ఎకరాకు రూ.8 వేలు కాగా, సాళ్లు తీయడం, ఎరువులు, మొక్కల తీగలను అల్లడానికి కట్టె, దారాలు, కూలీల ఖర్చు, ప్రతి వారం రసాయన మందులు పిచికారీ, కాయలు కోయడం, మార్కెట్‌కు తరలించడం వంటి వాటికి ఖర్చు అధికంగా వస్తుందని రైతులు చెబుతున్నారు. మహిళా కూలీలకు రూ.300 పురుష కూలీలకు రూ.500 వరకూ ఖర్చు అవుతుంది.

రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల ఆదాయం

తీగ జాతి పంటల్లో ప్రతి రెండు మూడు రోజులకు ఓ సారి కాయలను కోసి మార్కెట్‌కు తరలించవచ్చు. కంటికి రెప్పలా కాపాడుకుంటే రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకూ సంపాదించవచ్చు. జిల్లాలో మొత్తం కూరగాయల పంటలు 15 వేల హెక్టార్లకు పైగా సాగు చేస్తున్నారు. ఇందులో ఒక్క టమాటా 11500 హెక్టార్లు కాగా బీర 210 హెక్టార్లు, కాకర 152 హెక్టార్లు, ఇతర పంటలు సాగవుతున్నాయి.


టమాటతో గిట్టుబాటు



రెండు ఎకరాల్లో సాగు చేసిన టమాటాకు మంచి గిట్టుబాటు ధరలు వచ్చాయి. 13 కిలోల బాక్సు కాయ సైజు నాణ్యతను బట్టి రూ. 400 నుంచి రూ.600 వరకూ విక్రయిస్తున్నాము. ఇదే ధరలు మరో నెల రోజులు ఉంటే లాభాలు ఆశించవచ్చు. ప్రస్తుతం చాలా మంది రైతులు టమాట సాగు చేశారు.

– శ్రీనివాసరెడ్డి, వంచిరెడ్డిపల్లి, ఓడీ చెరువు

లాభసాటిగా కూరగాయల సాగు



కూరగాయల పంటలు లాభసాటిగా మారాయి. సాంప్రదాయ పంటలతో విసిగి పోయి నాలుగేళ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నాను. బీర, కాకర పంటలను 3 ఎకరాల్లో వేశాను. వేసవిలో కలింగర, దోస సాగు చేస్తాను. గిట్టుబాటు ధరలు ఉండడంతో కూరగాయలకు లాభాలు వస్తున్నాయి. బెంగళూరు, బాగేపల్లి, మదనపల్లి మార్కెట్లకు కూరగాయలు తరలిస్తాను.

– జనార్ధన్‌రెడ్డి, బీర సాగు రైతు, పెదపల్లి